
# పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ




ఢిల్లీ: ఆగస్టు మాసాంతం నుంచి మొదలు కాబోయే పారాలింపిక్స్‌లో ప్రారంభ వేడుకలకు భారత్ నుంచి పతాకధారులుగా సుమిత్ అంతిల్, భాగ్యశ్రీ జాదవ్ ఎంపికయ్యారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న ఈ ఇద్దరూ ఆరంభోత్సవ వేడుకల్లో పతాకధారులుగా వ్యవహరిస్తారని పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) చీఫ్ దేవేంద్ర ఝఝూరియా ఓ ప్రకటనలో తెలిపారు. హర్యానాకు చెందిన సుమిత్ టోక్యో పారాలింపిక్స్‌లో ఎఫ్64 జావెలిన్ త్రో ఈవెంట్‌లో స్వర్ణం గెలిచాడు. మహారాష్ట్రకు చెందిన షాట్‌పుటర్ భాగ్యశ్రీ ఎఫ్34 కేటగిరీలో ఆసియా పారా గేమ్స్‌లో రజతం నెగ్గింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 దాకా పారిస్ వేదికగా జరుగబోయే ఈ క్రీడలకు భారత్ 84 మంది అథ్లెట్లతో బరిలోకి దిగుతోంది.

# యూఏఈలో మహిళల ప్రపంచకప్?



దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ నిర్వహణకు భారత్ విముఖత తెలపడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మిగతా ఆప్షన్లపై దృష్టి సారించింది. వరల్డ్ కప్‌ను నిర్వహించేందుకు ఎడారి దేశం యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదివరకే నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్ వేదికగా ఈ టోర్నీ జరగాల్సి ఉన్నప్పటికీ ఆ దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచకప్‌ను తరలించాలని ఐసీసీ భావిస్తోంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఈ టోర్నీని నిర్వహిస్తామని హామీ ఇస్తూ మరికొన్ని రోజులు గడువు కోరినప్పటికీ ఐసీసీ మాత్రం సంతృప్తి చెందడం లేదు. యూఏఈలో వాతావరణ పరిస్థితులూ ఈ టోర్నీ నిర్వహణకు అనుకూలంగా ఉండటంతో ఆ దేశం మెగా టోర్నీ నిర్వహణకు ఉవ్విళ్లూరుతున్నట్టు సమాచారం. దుబాయ్, అబుదాబిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టేడియాలు, ఇదివరకే అక్కడ పురుషుల టీ20 ప్రపంచకప్ నిర్వహించిన అనుభవం ఉండటంతో ఐసీసీ కూడా యూఏఈ వైపునకే మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది. అక్టోబర్ 3 నుంచి 20 మధ్య మహిళల ప్రపంచకప్ జరగాల్సి ఉంది.

# రీఎంట్రీలో అదరగొట్టిన ఇషాన్

- బుచ్చిబాబు టోర్నీలో శతకం



తిరునెల్వేలి: గతేడాది భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆగ్రహానికి గురై బోర్డు కాంట్రాక్టుతో పాటు జాతీయ జట్టులో చోటు కోల్పోయిన ఇషాన్ కిషన్ దేశవాళీ టోర్నీలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే శతకంతో చెలరేగాడు. తమిళనాడు వేదికగా జరుగుతున్న బుచ్చిబాబు టోర్నీలో భాగంగా జార్ఖండ్ సారథిగా బరిలోకి దిగిన ఇషాన్.. సెంచరీ (107 బంతుల్లో 114, 5 ఫోర్లు, 10 సిక్సర్లు)తో రాణించాడు. 86 బంతుల్లోనే శతకం పూర్తిచేసిన ఇషాన్ రెడ్ బాల్ క్రికెట్‌లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. 92 పరుగుల వద్ద ఉండగా వరుస సిక్సర్లతో శతకాన్ని పూర్తిచేశాడు. ఈ టోర్నీ ముగిశాక అతడు వచ్చే నెలలో మొదలయ్యే దులీప్ ట్రోఫీలో ఆడాల్సి ఉంది.

## కోకో గాఫ్ ఔట్

### సిన్సినాటి ఓపెన్

మసోన్ (యూఎస్): డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్ (అమెరికా) సిన్సినాటి ఓపెన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే పరాభవాన్ని చవిచూసింది. మహిళల సింగిల్స్‌లో భాగంగా తొలి రౌండ్‌లో బై దక్కగా రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో గాఫ్ 4-6, 6-2, 4-6తో యులియ పుటింట్సెవ (కజకిస్థాన్) చేతిలో ఓడింది. గతేడాది సిన్సినాటి ఓపెన్ నెగ్గి ఆ వెంటనే యూఎస్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచిన గాఫ్ ఈసారి తొలి మ్యాచ్‌లోనే ఓడింది. పురుషుల సింగిల్స్‌లో సిట్సిపస్, దిమిత్రోవ్, మెద్వెదెవ్ వంటి టాప్ సీడ్ ఆటగాళ్లంతా రెండో రౌండ్‌కే వెనుదిరగడం గమనార్హం.


## ఆధిక్యంలో సఫారీలు

గయానా: వెస్టిండీస్‌తో గయానా వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో 160 పరుగులకే ఆలౌట్ అయిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం నిలకడగా ఆడుతోంది. విండీస్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే ఆలౌట్ చేసిన సఫారీలు 16 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా.. 17 ఓవర్లు ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసింది.

# డబ్ల్యూఎఫ్ఐ విధులకు బ్రేక్

### అడ్‌హక్ ప్యానెల్‌కు అప్పగించాలని ఐవోఏను ఆదేశించిన ఢిల్లీ కోర్టు

- ఆదేశాలను సవాల్ చేస్తామన్న సంజయ్ సింగ్
- రెజ్లర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన




ఢిల్లీ: గతేడాది వివాదాలకు కేంద్ర బిందువు అయిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. పారిస్ ఒలింపిక్స్ ముగిసిన వెంటనే మరోసారి డబ్ల్యూఎఫ్ఐ X అడ్‌హక్ కమిటీ డ్రామాకు తెరలేచింది. డబ్ల్యూఎఫ్ఐని యథాతథ స్థితిలో ఉంచి దాని కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీకి అప్పగించాలని ఢిల్లీ కోర్టు శుక్రవారం భారత ఒలింపిక్ సంఘానికి (ఐవోఏ) ఆదేశాలు జారీ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీకి అప్పగించాలని కోరుతూ ప్రముఖ రెజ్లర్లు బజరంగ్ పునియా, వినేశ్ ఫోగాట్, సాక్షి మాలిక్ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారిస్తూ న్యాయస్థానం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. పైన పేర్కొన్న రెజ్లర్లు గతేడాది డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి ఢిల్లీ వీధుల్లో న్యాయ పోరాటం చేసిన విషయం తెలిసిందే. రెజ్లర్ల పోరాటంతో కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూఎఫ్ఐని 2023 డిసెంబర్ 24న రద్దు చేయగా.. బ్రిజ్ భూషణ్ అనుచరుడైన సంజయ్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త పాలకవర్గం ఎన్నికైంది. ఇక యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) సైతం ఈ ఏడాది ఫిబ్రవరిలో డబ్ల్యూఎఫ్ఐపై నిషేధాన్ని ఎత్తివేయడంతో ఐవోఏ సైతం అడ్‌హక్ కమిటీని రద్దు చేసింది.

**రెజ్లర్లు నష్టపోయే ప్రమాదం: సంజయ్ సింగ్**

ఢిల్లీ కోర్టు ఆదేశాలపై సంజయ్ సింగ్ స్పందిస్తూ ఇది యువ రెజ్లర్లకు తీరని నష్టం చేకూర్చుతుందని, వాటిని సవాల్ చేస్తామని అన్నాడు. అడ్‌హక్ కమిటీ జోక్యంతో రాబోయే ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రెజ్లర్ల ప్రాతినిధ్యం ప్రశ్నార్థకంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. 'ఐవోఏ గతంలో అడ్‌హక్ ప్యానెల్‌ను రద్దు చేసింది. ఈ ఆదేశాలపై మేం ద్విసభ్య ధర్మాసనానికి వెళ్తాం. అంతేగాక యూడబ్ల్యూడబ్ల్యూ, అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐవోసీ)నూ సంప్రదిస్తాం. బయటివాళ్ల జోక్యం అథ్లెట్లపై ప్రభావం చూపుతుందని ఇప్పటికే వాళ్లు హెచ్చరించారు. త్వరలో రెండు వరల్డ్ చాంపియన్‌షిప్‌లు జరగాల్సి ఉంది. అడ్‌హక్ కమిటీ జోక్యం చేసుకుంటే ఆ పోటీలలో రెజ్లర్ల ప్రాతినిధ్యం ప్రశ్నార్థకమవుతుంది' అని అన్నాడు. ఆగస్టు 19 నుంచి 25 దాకా జోర్డాన్‌లో అండర్ 17 వరల్డ్ చాంపియన్‌షిప్, సెప్టెంబర్ 2-8 వరకు స్పెయిన్‌లో అండర్ 20 వరల్డ్ చాంపియన్‌షిప్ జరగాల్సి ఉంది.

# ఒక తండ్రి కల.. కూతురి పోరాటం

- 'ఎక్స్'లో వినేశ్ సుదీర్ఘ లేఖ




ఢిల్లీ: 'అనర్హత వేటు' తర్వాత ఇప్పటివరకూ ఆ విషయమై ఎలాంటి ప్రకటనా చేయని వినేశ్ ఫోగాట్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ లేఖతో స్పందించింది. లేఖలో తన తల్లిదండ్రుల కష్టం, మనుగడ కోసం ఆమె సాగించిన పోరాటం, గత రెండేండ్లుగా మ్యాట్ లోపల, ఆవల ఎదుర్కొన్న సవాళ్లు, ఒలింపిక్స్ ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఆమె పడ్డ తపన గురించి రాసుకొచ్చింది. ''ఒక చిన్న గ్రామంలో పసి వయసులో ఉన్నప్పుడు నాకు ఈ ఒలింపిక్స్, మ్యాట్ గురించి ఏమీ తెలియదు. సాధారణ అమ్మాయి కలలుగనే మాదిరిగానే నాకూ పొడవైన జడ పెంచుకోవాలని, స్నేహితులతో కాలక్షేపం చేస్తూ ఫోన్‌తో ఆడుకోవాలని మాత్రమే ఉండేది. మా నాన్న ఒక సాధారణ బస్ డ్రైవర్. ఆయనెప్పుడూ తన కూతురు ఉన్నత స్థితిలో ఉండాలని కోరుకునేవారు. 'నువ్వు పైన విమానంలో వెళ్తుంటే నేను కింద బస్‌లో వెళ్తా' అని నాతో చెబుతుండేవారు. ఆయనకున్న ముగ్గురి సంతానంలో నేనే చిన్నదాన్ని అవడం వల్ల నా మీద ఎక్కువ ప్రేమ చూపించేవారు. ఆయన కలను చూసి అప్పట్లో నేను నవ్వుకునేదాన్ని. మా నాన్న మా నుంచి వెళ్లిపోయినా ఆయన చెప్పిన మాటలు నా మదిలో నిలిచిపోయాయి. నా తల్లి తన జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించింది. తన పిల్లలు బాగా బతకాలని అందుకోసం ఆమె చేయగలిగినంత చేసింది. కానీ మా నాన్న చనిపోయిన కొన్నిరోజులకే తానూ తనువు చాలించింది. మా నాన్న కల నా మదిలో నాటుకుపోగా మా అమ్మ పోరాటం నాకు స్ఫూర్తినిచ్చింది. జీవన మనుగడ కోసం చేసిన పోరాటంలో చిన్ననాటి నా కల (పొడువు జడ, మొబైల్ ఫోన్) చెదిరిపోయాయి. కానీ నేనెప్పుడూ మా అమ్మ చూపిన బాటలోనే నడిచాను. గడిచిన ఏడాదిన్నర, రెండేండ్లుగా మ్యాట్ లోపల, బయట నా జీవితం ఊహించని మలుపులను తీసుకుంది. నా చుట్టూ నిజాయితీగా నాకు మద్దతు పలికినవాళ్లు నా కష్టకాలంలో అండగా నిలిచారు. వాళ్ల నమ్మకంతోనే నేను సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలుగుతున్నాను. డాక్టర్ దిన్షా పర్దివాలా నాకు దేవుడు పంపిన వైద్యుడు. ఆయన నాకు మూడుసార్లు ఆపరేషన్ చేశారు. ఆయన వల్లే నేను త్వరగా కోలుకుని మ్యాట్‌పైకి రాగలిగాను. అలాగే నా కోచ్ వొల్లర్ అకోస్ నాకు ఎల్లవేళలా మద్దతుగా నిలిచారు. రెజ్లర్ల పోరాటం జరుగుతున్నప్పుడు 2023 మే 28న జరిగిన ఆందోళనలో భారత జాతీయ జెండా కిందపడి నలిగిపోవడాన్ని నేను జీర్ణించుకోలేకపోయాను. ఒలింపిక్స్‌లో మువ్వన్నెల పతాక కీర్తిని రెపరెపలాడించాలని అప్పుడే భావించాను. ఇక ఆగస్టు 7న జరిగిన దాని (ఫైనల్ పోరుకు ముందు) గురించి నేను ఎంత చెప్పాలనుకున్నా మాటలు రావడం లేదు. ఆ రాత్రి నేను బరువు తగ్గేందుకు తీవ్రంగా కృషి చేశాను. ఎక్కడా వెనక్కి తగ్గలేదు. కానీ తుదిపోరుకు సమయం తక్కువగా ఉండటం వల్ల నేను కాలంతో పరిగెత్తలేకపోయాను. ఇది పునరావృతం కాకూడదని కోరుకుంటున్నా. నేను 2032 ఒలింపిక్స్ దాకా కొనసాగాలని కోరుకున్నా. కానీ నేను భవిష్యత్‌ను అంచనా వేయలేను. నాకు తెలిసిన, నేను నమ్మిన విషయం ఏమిటంటే నేను నమ్మిన దాని కోసం నిత్యం పోరాడుతూనే ఉంటాను' అని లేఖలో వివరించింది.

## వినేశ్ చరిత్ర సృష్టించింది



వినేశ్ ఫోగాట్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత క్రీడాకారుల బృందంతో సమావేశమైన సందర్భంగా మోదీ స్పందిస్తూ.. 'రెజ్లింగ్‌లో ఫైనల్‌కు చేరిన తొలి మహిళా క్రీడాకారిణిగా ఆమె చరిత్ర సృష్టించింది. అది మనందరమూ గర్వించాల్సిన విషయం' అని అన్నారు.

## ముగిసిన పీకేఎల్ వేలం



ముంబై: దేశ ఆర్థిక రాజధాని వేదికగా రెండ్రోజులుగా జరిగిన ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) వేలం విజయవంతంగా ముగిసింది. 11వ సీజన్ కోసం వేలాన్ని నిర్వహించగా రెండ్రోజుల్లో మొత్తం 118 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. తొలి రోజే సచిన్ తన్వర్‌ను తమిళ్ తలైవాస్ రూ. 2.15 కోట్లతో ఈ సీజన్‌లో అత్యధిక ధరకు కొనుగోలు చేయగా రెండో రోజు అజిత్ వి. కుమార్ (పుణె - రూ. 66 లక్షలు) పంట పండింది. జై భగవాన్‌ను బెంగళూరు జట్టు రూ. 63 లక్షలకు సొంతం చేసుకుంది. పీకేఎల్ చరిత్రలో తొలిసారిగా ఏకంగా 8 మంది ఆటగాళ్లు కోటి రూపాయల మార్కును దాటడం విశేషం. వేలంలో స్టార్ ఆటగాళ్లతో పాటు కేటగిరి- సీ, డీ ప్లేయర్లకూ భారీ డిమాండ్ ఏర్పడిందని లీగ్ కమిషన్, మషాల్ హెడ్ స్పోర్ట్స్ లీగ్స్ హెడ్ అనుపమ్ గోస్వామి తెలిపారు. తెలుగు టైటాన్స్ రూ. 1.72 కోట్లతో పవన్ సెహ్రావత్‌ను అట్టిపెట్టుకున్న విషయం తెలిసిందే.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.